కొత్త ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి

చిత్తూరు అర్బన్: కొత్త ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ జె.అరుణ ఆదేశించారు. ప్రత్యేక ఓటర్ల సంక్షిప్త సవరణ– 2024లో భాగంగా 18, 19 సంవత్సరాల వయసు కలిగిన అర్హులైన యువతను ఓటర్లుగా నమోదు చేయించడంపై అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ కొత్త ఓటర్ల నమోదు కోసం విద్యాసంస్థల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఇందుకోసం పది మంది అధికారులతో నియమించిన బృందాలు నగర పరిధిలోని 27 విద్యాసంస్థల్లో కొత్త ఓటర్లను గుర్తించి, ఓటు హక్కు నమోదు చేయించాలన్నారు. స్వీప్ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పక్కాగా నిర్వహించాలన్నారు. సహాయ కమిషనర్ గోవర్ధన్, ఎంహెచ్‌ఓ డాక్టర్ లోకేష్, ఎంఈ గోమతి, ఏసీపీ రామకృష్ణుడు, డీఈలు వెంకట ప్రసాద్, రమణ, మెప్మా సీఎంఎం గోపి, ఎంఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

బీఎల్‌ఓలు అందుబాటులో ఉండాలి ..

ప్రత్యేక ఓటరు నమోదు రోజుల్లో బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్‌ఓ)లు పోలింగ్ కేంద్రాల్లో కచ్చితంగా అందుబాటులో ఉండాలని కమిషనర్ అరుణ స్పష్టం చేశారు. చిత్తూరులోని షర్మస్ బాలికల పాఠశాలలోని 26, 45, 47, 50 పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం తీరును కమిషనర్ పరిశీలించారు. ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణను పరిశీలించారు. ఆదివారం కూడా ప్రత్యేక నమోదు కార్యక్రమం జరుగుతుందన్నారు.

క్షుణ్ణంగా పరిశీలించండి

పూతలపట్టు: పోలింగ్ బూత్ పరిధిలోని ఓటర్ల జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించాలని తహసీల్దార్ విజయభాస్కర్ అన్నారు. శనివారం మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో ప్రచార దినం నిర్వహించారు. అందులో భాగంగా పి.కొత్తకోట పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. తహసీల్దార్ మాట్లాడుతూ 18నుంచి 19 లోపు యువత, మరణించినవారు, శాశ్వతంగా ఊర్లో లేనివారు, ఒకే ఇంట్లో 10 కన్నా ఎక్కువ ఓటర్లు ఉంటే వారిని గుర్తించి సవరణ తప్పక చేయాలని సూచించారు. బీఎల్‌ఓలు, నేతలు అమర్నాథరెడ్డి పాల్గొన్నారు.



చిత్తూరులో ఓటర్ల ముసాయిదా పరిశీలిస్తున్న కమిషనర్ అరుణ

నేడు ఓటరు నమోదు శిబిరాలు

గుడిపాల: ఓటరు నమోదు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్ తెలిపారు. శనివారం చిత్తపార, బండపల్లె, పిల్లారికుప్పం, పాపసముద్రం, గుడిపాల పోలింగ్‌స్టేషన్‌ల పరిధిలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. బీఎల్‌ఓలు అందుబాటులో ఉండి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. ఆదివారం కూడా పోలింగ్ స్టేషన్లలో బీఎల్‌ఓలు అందుబాటులో ఉండి, 18 సంవత్సరాల నిండిన యువతను గ్రామాల్లో ప్రత్యేకంగా గుర్తించి కొత్త ఓటరుగా నమోదు చేయించాలన్నారు. డెప్యూటీ తహశీల్దార్ కల్యాణి పాల్గొన్నారు.

కొత్త ఓటర్ల నమోదుకు 114 క్లెయిమ్‌లు

తవణంపల్లె: మండలంలో కొత్త ఓటర్లు నమోదుకు 114 క్లెయిమ్‌లు వచ్చినట్లు తహసీల్దార్ గుణశేఖర్ రెడ్డి తెలిపారు. శనివారం ఓటర్ల నమోదుపై మండలంలోని 56 పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక క్యాంపు నిర్వహించినట్లు వివరించారు. 56 మంది బీఎల్‌ఓను, పనితీరు పర్యవేక్షణకు ఐదుగురు సూపర్‌వైజర్లను నియమించినట్లు పేర్కొన్నారు. మండలంలో అర్హులైన నూతన ఓటర్ల నమోదుకు 114 క్లైమ్‌లు రాగా, ఓటర్లు తొలగించేందుకు ఫాం.8 క్లెయిమ్‌లు 62 వచ్చినట్లు వివరించారు. భూ రీసర్వే డీటీ వెంకటరమణ, ఏఎస్‌ఏ శాంతి, సీనియర్ అసిస్టెంట్ భాస్కర్, జూనియర్ అసిస్టెంట్లు హసీన్, హేమకుమార్ పాల్గొన్నారు.



పి.కొత్తకోట : మాట్లాడుతున్న తహసీల్దార్



అరగొండ: పర్యవేక్షిస్తున్న తహసీల్దార్



గుడిపాల: జాబితాను పరిశీలిస్తున్న తహసీల్దార్

పేరయ్యగారిపల్లెలో ఫ్యామిలీ డాక్టర్



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

ఐరాల: ఫ్యామిలీ డాక్టర్‌తో గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికీ వైద్యసేవలు అందిస్తున్నామని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. పేరయ్యగారిపల్లెలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వైద్య వాహనంలో 85 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పైమాఘంలో..



తవణంపల్లె: మండలంలోని పైమాఘం, టి.పుత్తూరు గ్రామాల్లో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. టి.పుత్తూరులో వైద్యాధికారి డాక్టర్ ధాత్రేయచౌదరి 45 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. పైమాఘంలో వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు 62 మందికి వైద్యపరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.

క్లుప్తంగా

అర్ధగిరిని దర్శించుకున్న లోకాయుక్త జడ్జి



జడ్జి లక్ష్మణరెడ్డిని ఆశీర్వదిస్తున్న అర్చకులు

తవణంపల్లె: అర్ధగిరి వీరాంజనేయస్వామి దేవస్థానాన్ని శనివారం కర్నూలు లోకాయుక్త జడ్జి లక్ష్మణరెడ్డి కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. జడ్జికి ఆలయ అధికారులు, అర్చకులు సాదర స్వాగతం పలికారు. అనంతరం స్వామికి అభిషేకం, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించి జడ్జి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ మండపంలో అర్చకులు జడ్జి కుటుంబ సభ్యులకు ఆశీర్వచనం చేసి, స్వామి వారి ప్రసాదాలు, సహజసిద్ధమైన సంజీవ రాయ పుష్కరిణి తీర్థాన్ని అందజేశారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



కాణిపాకం(యాదమరి): కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళాన్ని వెస్ట్ గోదావరి జిల్లా పెంటపాడుకు చెందిన వెంకటరమణ, రాజు ఆలయ అధికారులకు అందజేశారు. దాత కుటుంబసభ్యులు శనివారం స్వామివారి దర్శనార్థం విచ్చేసి విరాళాన్ని ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డికి అందజేశారు. వారికి ఆలయ అధికారులు స్వామి వారి ప్రత్యేక దర్శనం కల్పించారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ విష్ణుష్ పాల్గొన్నారు.

టీడీపీ, బీజేపీకి తగిన బుద్ధి చెప్పాలి

చిత్తూరు కార్పొరేషన్: మతోన్మాద బీజేపీ, కులల మధ్య చిచ్చుపెట్టే తెలుగుదేశంకు తగిన బుద్ధి చెప్పాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే గఫూర్ తెలిపారు. శనివారం సీపీఎం ప్రజారక్షణ భేరి బస్సు యాత్ర చిత్తూరుకు చేరుకుంది. ఎంఎస్ఆర్ కూడలి వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అమరావతిలో రాజధాని కట్టడంతోపాటు రాష్ట్ర నలమూలలను సమానభివృద్ధి చేయాలని గతంలో చంద్రబాబుకు సీపీఎం తరపున వినతి చేశామని గుర్తు చేశారు. కానీ ఆయన అమరావతి ధ్యేయంగా పనిచేయడంతో అది నచ్చని ప్రజలు ఆయనను ఓడించారన్నారు. రాయలసీమను కరువు ప్రాంతంగా ప్రకటించి ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను కేంద్రం అమాంతం పెంచిందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణయ్య, ఉమామహేశ్వరావు, శివనాగరాణి, చైతన్య, సురేంద్ర, రమాదేవి పాల్గొన్నారు.

సీపీఎం బస్సు జాతా



బస్సు జాతాలో నేతలు

బంగారుపాళెం: మండల కేంద్రంలో శనివారం సీపీఎం నాయకులు బస్సు జాతా కార్యక్రమాన్ని నిర్వహించారు. సీపీఎం రాష్ట్ర నాయకుడు కృష్ణయ్య, కేంద్ర కమిటీ సభ్యుడు గఫార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిత్యవసర ధరలను నియంత్రించకపోవడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

షర్మిలకు డాక్టరేట్



షర్మిల

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని లక్ష్మీనగర్ కాలనీకి చెందిన షర్మిలకు తిరుపతి జిల్లా శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈమె బయో సైన్స్ అండ్ సెరికల్చర్ విభాగంలో పరిశోధన పూర్తి చేశారు. ప్రొఫెసర్ మమత పర్యవేక్షణలో సూక్ష్మజీవుల విశ్లేషణ.. జాంబిక్స్ మోరీ జాతులు అనే అంశంపై చేసిన పరిశోధనకు పీహెచ్‌డీ లభించింది.

మేకల అపహరణ

గుడిపాల: మండలంలోని వసంతాపురంలో శనివారం తెల్లవారుజామున మేకలు చోరీకి గురయ్యాయి. గ్రామంలోని కూలీ ఆర్ముగం ఉడయార్ శుక్రవారం రాత్రి రోజూ మాదిరే ఇంటి ముందు మూడు మేకలను కట్టి ఉంచాడు. శనివారం ఉదయం నిద్రలేచి చూడగా మేకలు లేవు. ఈ మేకల విలువ రూ.20వేలు చేస్తుందని, న్యాయం చేయాలని బాధితుడు గుడిపాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీసీ ఫుటేజ్ పరిశీలించి దొంగలను పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

తిరుమలకు పాదయాత్రగా..

గంగవరం: తిరుమల శ్రీవారి దర్శనార్థమై గుండుగల్లు గ్రామానికి చెందిన భక్తులు 200మంది సర్పంచ్ రమణ ఆధ్వర్యంలో శనివారం పాదయాత్రగా బయలుదేరారు. గోవింద మాల ధరించి స్థానిక కోదండరాముని ఆలయంలో పూజల అనంతరం పాదయాత్ర ప్రారంభించారు. ఏళ్ల తరబడి తిరుమలకు పాదయాత్రగా వెళ్లడం ఆనవాయితీగా వస్తోందని భక్తులు తెలిపారు.

జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందాం



సమావేశంలో మాట్లాడుతున్న నవీన్

పూతలపట్టు(యాదమరి): జగనన్నను మరోసారి సీఎం చేసుకుందామని పూతలపట్టు నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ నవీన్ అన్నారు. శనివారం చిత్తూరులోని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు కార్యాలయంలో నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా సభ్యులకు సమావేశం నిర్వహించారు. కన్వీనర్ నవీన్ మాట్లాడుతూ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి కాగానే నవరత్నాల పేరుతో వంద శాతం నెరవేర్చారన్నారు. లబ్ధిదారులకు అందిన లబ్ధి, అభివృద్ధి కార్యక్రమాలను సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని నవీన్ కోరారు. సోషల్‌మీడియా సభ్యులు దినేష్ పాల్గొన్నారు.

సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న సీఈఓ ప్రభాకర్‌రెడ్డి

పెద్దపంజాణి: విద్యార్థులు సమయాన్ని వృథా చేసుకోకుండా బాగా చదవాలని జెడ్పీ సీఈఓ పి.ప్రభాకర్‌రెడ్డి ఆదేశించారు. మండలంలోని రాయలపేట మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టికతో పాటు రికార్డులను పరిశీలించారు. విద్యార్థులను పలు సబ్జెక్టులకు సంబంధించి ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. పాఠశాల ఆవరణలోని వంట గది, టాయిలెట్స్‌ను పరిశీలించారు. నాడు–నేడు పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఎంపీడీఓ అబ్దుల్ రహీం, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు బాలచందర్, మురళి పాల్గొన్నారు.

డిసెంబర్ 9న జాతీయ లోక్‌అదాలత్



మాట్లాడుతున్న న్యాయమూర్తి వాసుదేవరావు, చిత్రంలో జడ్జిలు కార్తీక్, సింధు

పుంగనూరు: డిసెంబర్ 9న పుంగనూరు కోర్టు ఆవరణలో జరిగే జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్‌జడ్జి వాసుదేవరావు కోరారు. శనివారం సాయంత్రం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కార్తీక్, అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి సింధుతో కలిసి పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. న్యాయమూర్తి వాసుదేవరావు మాట్లాడుతూ న్యాయస్థానాల్లో పెండింగ్ కేసులను పరిష్కరించే దిశగా లోక్‌అదాలత్‌లను న్యాయవాదులు, ప్రజలు వేదిక చేసుకోవాలన్నారు. లోక్‌అదాలత్‌లో రాజీకి అనువైన సివిల్, క్రిమినల్ కేసులు పరిష్కరిస్తామన్నారు. పోలీస్‌స్టేషన్ల పరిధిలో గల ఇరు పార్టీలను పిలిపించి, రాజీ మార్గంలో కేసులను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సీఐలు రాఘవరెడ్డి, కృష్ణారెడ్డి, ఎస్ఈబీ సీఐ సీతారామిరెడ్డి, ఎస్ఐలు రవికుమార్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వాలీబాల్ విజేత మర్రిమాకులపల్లె జట్టు



బహుమతులు అందుకున్న క్రీడాకారులు

చౌడేపల్లె: మేకలచిన్నేపల్లె ఉన్నత పాఠశాలలో పుంగనూరు జోన్ వాలీబాల్ క్రీడాపోటీలు శనివారం ఉత్కంఠ భరితంగా ముగిశాయి. జోన్ పరిధిలోని ఏడు మండలాల నుంచి 35 జట్లు పాల్గొన్నాయి. బాలికల విభాగంలో విన్నర్స్‌గా మర్రిమాకులపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల జట్టు, రన్నర్స్‌గా కాటిపేరి ఉన్నత పాఠశాల జట్టు విజేతగా నిలిచాయి. సీనియర్ బాలుర విభాగంలో విన్నర్స్‌గా విజయవాణి ఇంగ్లిషు మీడియం స్కూల్ జట్టు, రన్నర్స్‌గా కందూరు హైస్కూల్ విద్యార్థులు గెలుపొందారు. జూనియర్ బాలుర విభాగంలో విన్నర్స్‌గా జెడ్పీ హైస్కూల్ ముత్తుకూరు జట్టు, రన్నర్స్‌గా జెడ్పీ హైస్కూల్ చౌడేపల్లె జట్టు విజేతలుగా నిలిచాయి. గెలుపొందిన జట్లకు హెచ్ఎం నాగమల్లిక, ఎస్‌ఎంసీ మండల అధ్యక్షుడు లింగమూర్తి, జోనల్ క్రీడల కార్యదర్శి రామచంద్ర బహుమతులను అందజేశారు.

మహిళ ధాతృత్వం ఆదర్శనీయం



విజయలక్ష్మిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఐరాల: మండలంలోని కాణిపాకం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి దాతృత్వం ఆదర్శనీయమని కాణిపాకం జెడ్పీ హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్ఎం సురేష్‌బాబు అన్నారు. హెచ్ఎం మాట్లాడుతూ తమ పాఠశాలలో ప్రస్తుత విద్యా సంవత్సరం 2023–24 పది చదువుతున్న విద్యార్థులకు పబ్లిక్ పరీక్ష ఫీజు దాత రూ.18 వేలను చెల్లించడం మరువలేనదని అన్నారు. దాత నమ్మకాని ఒమ్ము చేయకుండా విద్యార్థులు పదో తరగతి పరీక్ష ఫలితాలలో వంద శాతం ఉత్తీర్ణులు కావాలని ఆకాంక్షించారు. అనంతరం దాతను హెచ్ఎం, ఉపాధ్యాయులు శాలువాతో ఘనంగా సన్మానించారు.

రచయిత నామినికి సన్మానం



సన్మానిస్తున్న రామచంద్రనాయుడు, అరుణకుమారి

పూతపట్టు: మండలంలోని మంగళ్ విద్యాలయాలో రచయిత నామిని సుబ్రమణ్యంను సంస్థ అధినేత గల్లా రామచంద్రనాయుడు సన్మానించారు. 'వైఎస్ఆర్ జీవన సాఫల్య పురస్కారం' అందుకున్న నామిని సుబ్రమణ్యంను ఘనంగా సన్మానించారు. గల్లా అరుణకుమారి, శాకం నాగరాజు, సతీష్, రమేష్‌నాయుడు, ప్రిన్సిపల్ ధనంజయనాయుడు పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు వందశాతం

యాదమరి: గ్రామాల్లోని చంటి పిల్లలకు, గర్భిణులకు వ్యాధి నిరోధక టీకాలు వందశాతం అందించాలని సంతగేటు ప్రభుత్వ వైద్యాధికారి అనిల్‌కుమార్ నాయక్ తెలిపారు. శనివారం ఆరిమాకులపల్లెలో వైద్య సిబ్బంది నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. సీహెచ్‌ఓ లక్ష్మీనారాయణ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పాల వెల్లువను సద్వినియోగం చేసుకోండి



తొడతర సభలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

తవణంపల్లె: జగనన్న పాలు వెల్లువ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తవణంపల్లె ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్, తహసీల్దార్ గుణశేఖర్‌రెడ్డి పాడి రైతులకు పిలుపునిచ్చారు. శనివారం చెర్లోపల్లె, తొడతర, ముట్టుకూరు, మత్యం, ఎగువ వెంకటాపురం గ్రామాల్లో జగనన్న పాలు వెల్లువ గ్రామ సభలు నిర్వహించారు. పాడి రైతులు 11 మందిని ఎంపిక చేసుకొని సొసైటీగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పాడి రైతులకు గిట్టుబాటు ధరలు కల్పిస్తారని వివరించారు. వెటర్నరీ అధికారి డాక్టర్ లావణ్య, ఏపీఓ లలిత, ఏపీఎం రవి, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, మహిళా పాడి రైతులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ విద్యార్థి ప్రతిభ



పోటీలకు ఎంపికైన గౌరీశంకర్

పుంగనూరు: అడవినాథునికుంట మోడల్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న గౌరీశంకర్‌కు అథ్లెటిక్స్ అండర్–14 పరుగుపందెంలో ప్రథమస్థానం లభించినట్లు హెచ్ఎం రమ తెలిపారు. శనివారం సాయంత్రం ఆమె మాట్లాడుతూ గౌరీశంకర్ స్కూల్‌గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో తిరుపతిలో జరిగిన జిల్లా పోటీల్లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. పీఈటీ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు గౌరీశంకర్‌ను అభినందించారు.

నేడు కుప్పంలో జాబ్‌మేళా

కుప్పం: సాయిమాతా సేవా ట్రస్టు ఆధ్వర్యంలో సాహి ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో ఉద్యోగాలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ట్రస్టు నిర్వాహకుడు జగదీష్ బాబు తెలిపారు. ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు స్థానిక ప్రభుత్వ బాలుర పాఠశాలలో ఇంటర్వ్యూలు జరుగుతాయని తెలిపారు. 10వ తరగతి, డిగ్రీ పూర్తయిన అభ్యర్థులు ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో జాబ్‌మేళాకు హాజరుకావాలన్నారు. వివరాలకు 9391833999 నంబరును సంప్రదించాలన్నారు.

వేడుకగా పవిత్రోత్సవాలు ప్రారంభం



చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం రాములవారి గుడి వీధిలో వెలసిన శ్రీకోదండరామస్వామి ఆలయంలో నాలుగు రోజుల పవిత్రోత్సవాలు శనివారం వేడుకగా ప్రారంభమయ్యాయి. అంకుర్పారణ, హోమ పూజలు, పుణ్యాహవచనం, పాలికాప్రతిష్ట శాస్త్రోక్తంగా నిర్వహించారు. అంతకు ముందు శ్రీసీతాలక్ష్మణ సమేత శ్రీరామచంద్రమూర్తికి ప్రత్యేక పూజలు, అలంకరణలు జరిగాయి.

ఇంటి వద్దకే వైద్య సేవలు



వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ హరి

గుడిపాల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం కింద ఇంటి వద్దకే వచ్చి వైద్య సేవలు అందిస్తున్నట్లు గుడిపాల ప్రాథమిక వైద్యాధికారి హరి అన్నారు. శనివారం బసవాపల్లె ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. మంచానికే పరిమితమైన రోగులకు ఇంటి వద్దకే వెళ్లి వైద్య సేవలు అందించారు. వైద్య శిబిరంలో బీపీ, షుగర్, గర్భిణులకు పరీక్షలు చేసి మాత్రలను పంపిణీ చేశారు. వైద్యసిబ్బంది విజయ, చంద్ర, రోసలిన్, పంకజ,నిత్య పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం



వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న మేయర్, డిప్యూటీ మేయర్లు

చిత్తూరు అర్బన్: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు పేదలకు వరం లాంటిదని చిత్తూరు నగర మేయర్ అముద అన్నారు. నగరంలోని 7వ వార్డు సచివాలయంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని మేయర్, డిప్యూటీ మేయర్లు ఆర్.చంద్రశేఖర్, రాజేష్ కుమార్ రెడ్డి పరిశీలించారు. మేయర్ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్షలో ఖరీదైన వైద్య పరీక్షలు, వైద్య సేవలతో పాటు మందులు ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. వైద్యాధికారులు, సిబ్బంది ప్రజల వద్దకే వెళ్లి వారికి అవసరమైన వైద్య సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ఖరీదైన వైద్య పరీక్షలను పేదలకు ఉచితంగా చేస్తున్నట్లు తెలిపారు. జగనన్న సురక్ష కిట్లను పంపిణీ చేశారు. అంగన్‌వాడీ, డ్వాక్రా మహిళల స్టాల్స్‌ను సందర్శించారు. కార్పొరేటర్ మధుబాబు, ప్రజారోగ్యశాఖ అధికారి డాక్టర్ లోకేష్, వైద్యాధికారులు, వార్డు కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.